www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 10 ఆగస్టు 2023



డికె కళాశాలలో 'నాభూమి...నాదేశం'

ప్రజాశక్తి-నెల్లూరు :స్థానిక డికె కళాశాలలో నాభూమి...నాదేశం కార్యక్రమం ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్ఐఒ, కళాశాల ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాసులు పాల్గొని అధ్యక్షత వహించారు. విద్యార్థులు వసుధా వందన్, పంచప్రాణ్ ప్రతిజ్ఞ, వీర సైనికులకు వందనం కార్యక్రమం నిర్వహించి ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ కస్తూర్బా కళాక్షేత్ర నుంచి జిల్లా పరిషత్ కార్యాలయం వరకు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎన్‌సిసి విభాగం కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కర్నల్ సనీల్‌కుమార్, పూర్వం సైన్యంలో జూనియర్ కమిషనర్ ఆఫీసర్‌గా సేవలందించిన భాస్కర్, ఎన్‌సిసి హవల్దార్ మనికందన్‌లను ఘనంగా సన్మానించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి అనంతరం ఎన్‌సిసి అధికారులు విద్యార్థులతో ఆంగ్లం, హిందీలో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మొక్కలు నాటించారు. కార్యక్రమంలో ఎన్‌సిసి ప్రోగ్రాం ఆఫీసర్లు, కరుణకుమారి, ప్రసన్న, భారతి, లెక్చరర్లు రవీంద్రనాథ్, వెంకటేశ్వర్లు, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సమాయత్తం..!

○నియోజకవర్గ ఆర్‌ఒల నియామకం
○ఓటర్ల చేర్పులు..మార్పులు
○రాజకీయపార్టీల సన్నాహాలు

2024 సార్వత్రిక ఎన్నికలు ముందస్తుగా వస్తాయని ప్రచారం ఊపందుకుంది. అందుకు అనుగుణంగా చక చక ఏర్పాట్లు సాగుతున్నాయి. ఇప్పటికే ఎన్నికల సంఘం జిల్లాలోని పార్లమెంట్ నియోజక వర్గం, 8 నియోజక వర్గాలకు ఆర్‌ఒలను నియమించారు. ఓటర్ల, మార్పులు చేర్పులకు జరుగుతున్నాయి. మరో వైపు జిల్లా అధికార యంత్రాంగా ఓటర్లు బాక్సుల తనిఖీ, రాజకీయ పార్టీల తో నియమ నిబంధనలు పాటించాలని తెలిపారు. ఇదే సమయంలో అధికారపార్టీ ప్రభుత్వ కార్యక్రమాలు పెంచారు. ప్రతిపక్షపార్టీలు ప్రజల్లోకి వెళుతున్నాయి. మరో ఆర్నెల్లలో ముందస్తు ఎన్నికలు వస్తాయని జరుగుతోన్న ప్రచారానికి బలం చేకూరేలా ఏర్పాట్లు సాగుతున్నాయి.

గోడౌన్లను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలకు పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి వస్తాయని, ముందస్తుగా ఎన్నికలకు వెళతారనే ప్రచారం సాగుతోంది. అందులో భాగంగా ఎన్నికల సంఘం ఓ వైపు,. రాజకీయ పార్టీలు మరో వైపు సమాయత్తం అవుతున్నాయి. 2024 మార్చి, ఏప్రిల్‌లో ఎన్నికలు వస్తాయని తెలుస్తోంది. అధికారపార్టీ నేతలు స్పీడ్ పెంచారు. ప్రభుత్వ కార్యక్రమాలు వేగవంతం చేశారు. వైసిపి ఎంఎల్‌ఎలు, ఇన్‌ఛార్జులు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతుంది. జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష, జగనన్న భూహక్కుతోపాటు మూతపెట్టేసిన పథకాలను బయటకు తీసింది. హౌసింగ్‌ను వేగవంతం చేస్తుంది. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను తగ్గించడానికి ప్రయత్నాలు మొదలు పెట్టింది. అధికారులకు బాగా పనిచేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తాము గెలిచేలా చూస్తున్నారు. ఇదే సమయంలో ప్రతిపక్ష పార్టీలు ప్రజలకు దగ్గర కావడానికి వేగంగా పావులు కదుపుతున్నారు. టిడిపి జాతీయ వరకు యువనేత నారా లోకేష్ యువగళం నిర్వహించా రు. ఇటీవల చంద్రబాబు నాయుడు ప్రాజెక్టుల విధ్వంసంపై జిల్లాలో పర్యటించారు. వివిధ నియోజక వర్గాల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్న నేతలు ప్రజా సమస్యలపై పనిచేస్తున్నారు.

ఎన్నికల అధికారుల నియామకం..!

ఎన్నికల కోసం ఎన్నికల సంఘం సన్నద్ధం చేస్తుంది. ముందస్తుగా ఎన్నికలు వస్తాయని తెలియడంతో ముందుగా ఐజిలిను ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని నియోజకవర్గాలకు ఆర్‌ఒలను నియమించింది. కావలి నియోజక వర్గానికి ఆర్‌డిఒ కావలి, ఆత్మకూరు నియోజక వర్గానికి ఆర్‌డిఒ ఆత్మకూరు, కోవూరు నియోజక వర్గానికి నెల్లూరు జెసి, నెల్లూరు సిటీ నియోజకవర్గానికి మున్సిపల్ కమిషనర్ నెల్లూరు, గూడూరు నియోజకవర్గానికి ఆర్‌డిఒ గూడూరు, సూళ్లూరు పేట నియోజక వర్గానికి ఆర్‌డిఒ, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గానికి జెసి తిరుపతి, ఉదయగిరి నియోజకవర్గానికి సోమశిల ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, సర్వేపల్లి నియోజక వర్గానికి టిజిపి స్పెషల్ కలెక్టర్, ఎన్నికల సంఘం నియమించింది. అధికారులకు విజయవాడలో ప్రత్యేక శిక్షణ నిర్వహించారు.

ఓటర్ల చేర్పులు, మార్పులు..

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్లు, చేర్పులకు అధికారులు చర్యలు చేపట్టారు. సచివాలయాల నుంచి ఓట్లు ఎక్కువున్నాయో పరిశీలించి, వచ్చే ఎన్నికల్లో ఎవరికి ఓటు వేస్తారనే ప్రశ్నలు అడుగుతున్నారు. ప్రభుత్వం వైపు నుంచి అడుగుతున్నారు. వైసిపికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం కలెక్టర్ హరి నారాయణ్ రాజకీయ పార్టీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బ్యాలెట్ బాక్సులను పరిశీలించారు. ఓ వైపు అధికారుల సమాయత్తం, మరో వైపు రాజకీయ పార్టీ దూకుడుతో ఎప్పుడైనా ఎన్నికలు వస్తాయని ప్రచారం సాగుతోంది.

మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణ్

ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం

ప్రజాశక్తి-నెల్లూరు: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ మతోన్మాద చర్యలతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా అందరూ ఏకమై ఉద్యమించాలని కార్మిక సంఘాల యొక్క కార్యాచరణ కమిటీ పిలుపు నిచ్చిందని సిఐటియు జిల్లా కమిటీ పేర్కొంది. బుధవారం నగరంలో కార్మిక సంఘా కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నగరంలో భారీ ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆగస్టు 9 క్విట్ ఇండియా డే ను పురస్కరించుకొని పోరాడి సాధించుకున్న భారత దేశ స్వాతంత్ర ఉద్యమాన్ని నేడు మోడీ కార్పొరేట్లకు దాసోహం చేస్తున్నారని ప్రయివేటీకరణ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలన్నీ కార్పొరేట్ల వసమౌతున్నాయన్నారు. మణిపూర్ హర్యానా రాష్ట్రాల్లో జరుగుతున్న మతోన్మాద దాడుల లో కీలక పాత్ర బిజెపి ఆర్ఎస్ఎస్ వహించడమే ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు.కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టివివి ప్రసాద్, కె.అజయ్ కుమార్, ఎఐటియుసి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామరాజు, దామ అంకయ్య, ఐఎఫ్‌టియు నాయకులు సాగర్, ఐఎఫ్‌టియు న్యూ నాయకులు లక్ష్మారెడ్డి ,యానాదయ్య శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ డి అన్నపూర్ణమ్మ , సిఐటియు నాయకులు అల్లాడి గోపాల్, సురేష్ ,రెహానా బేగం, మురళి, కిన్నెర కుమార్ ,కొండా ప్రసాద్ ,బత్తల కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు

పారదర్శకంగా ఓటరు జాబితా తయారు

ప్రజాశక్తి-నెల్లూరు:ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పూర్తి పారదర్శకంగా ఓటరు జాబితా ను తయారు చేయడం జరుగుతుందని, ఇందుకు అన్ని రాజకీయ పక్షాలు తమ వంతు సహకారం అందించాల్సిందిగా కలెక్టర్ ఎం హరినారాయణన్ సూచించారు. బుధవారం కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో ఇంటింటి ఓటర్ సర్వే ప్రక్రియ గురించి గుర్తింపు కలిగిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిం చారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి బుధవారం జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీల సమావేశం నిర్వహిస్తామన్నారు.కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, వై ఎస్ ఆర్ పార్టీ తరపున విజయ్ కుమార్ రెడ్డి, టి డి పి తరపున వెంకటేశ్వర రెడ్డి, బిజెపి శ్రీనివాస్, ఆమ్ ఆద్మీ సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు రద్దు చేయడం తగదు..

పోరు యాత్రలో నినాదాలు చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు: ఎన్నికల ప్రచారంలో ఆర్భాటంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తామంటూ హామీలిచ్చి తీరా అధికారంలోకి వచ్చిన అనంతరం కరెంట్ బిల్లుకు లింకుపెట్టి పింఛన్లు రద్దు చేయడం, పలు సంక్షేమ పథకాలను రద్దు చేయడం సరికాదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం మోహన్ రావు అన్నారు. నగర నియోజకవర్గ పరిధిలో సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా పోరు యాత్ర బుధవారం నాటికి 4వ రోజుకు చేరుకుంది. శెట్టిగుంట రోడ్డు సెంటర్ నుంచి ఈ ప్రజా పోరు యాత్రను సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు ప్రారంభించారు. నగర నియోజకవర్గంలోని 6,7,8,9,10 డివిజన్ల పరిధిలో శెట్టిగుంట రోడ్డు, వీవర్స్ కాలనీ, లక్ష్మీపురం,పప్పుల వీధి, నవాబుపేట, రామచంద్రపురం, ఎఫ్సిఐ కాలనీ, రాంనగర్లలో సిపిఎం కార్యకర్తలు పర్యటించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. మోహన్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కరెంటు ఛార్జీలు భారీగా పెంచిందన్నారు. అది చాలక కరెంటు ఛార్జీలతో ముడిపెట్టి పెన్షన్లు,రేషన్ కార్డులు, సంక్షేమ పథకాలను సైతం రద్దు చేశారన్నారు. ప్రజా పోరుయాత్ర సందర్భంగా అనేకమంది ప్రజలు పెన్షన్లు రద్దు పై తెలియజేస్తున్నారన్నారు. నగరంలో మౌలిక సదుపాయాలైన మంచినీటి సరఫరా, రోడ్లు,వీధిలైట్లు, పారిశుధ్యం, డ్రయినేజీ లాంటి కనీస సదుపాయాలు కల్పించడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా ఇవ్వకుండా మోసం చేసిన బిజెపికి వైసిపి, తెలుగుదేశం రెండు పార్టీలు కలిసి వూడిగం చేస్తున్నాయన్నారు. పట్టణ సంస్కరణల పేరుతో ఇంటి పన్నుల భారీగా పెంచారని, కొత్తగా చెత్త పన్ను విధించారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజా పోరు యాత్ర జరుపుతున్నామన్నారు.సమస్యలు పరిష్కరించని పక్షంలో దశలవారీ ఉద్యమం చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు,నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి.నాగేశ్వరావు, షేక్ మస్తాన్‌బీ, పి.సూర్యనారాయణ, నగర కమిటీ సభ్యులు బీపీ నరసింహ, కత్తి పద్మ,మూలం ప్రసాద్, కె. చెంగయ్య, ఎన్. వి.సుబ్బమ్మ, వేణు, స్థానిక నాయకులు నాగయ్య,రాంబాబు, రెహనుమా, సిలారమ్మ పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-నెల్లూరు:ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగంగా శారీరక వ్యాయామంతో పాటు మెరుగైన ఆహారపు అలవాట్లు ఎంతో ముఖ్యమని జాయింట్ కలెక్టర్ రోణంకి కుర్మనాథ్ పేర్కొన్నారు.ఈ నెల 11, 12, 13 తేదీల్లోని కస్తూరిదేవి గార్డెన్స్ లో మత్స్య శాఖ, భూమి ఆర్గానిక్ సంస్థ ఆధ్వర్యంలో జరుగు సీ పుడ్ ఫెస్టివల్ ను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం వి ఆర్ సి సెంటర్ నుండి కస్తూరిదేవి గార్డెన్స్ వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీ ప్రారంభానికి విచ్చేసిన జె సి కుర్మనాథ్ కు భూమి ఆర్గానిక్ సంస్థ ఎం డి రఘురామ్ పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. డి కె డబ్ల్యు, విక్రమ సింహపురి, ఫిషరీస్ కాలేజీ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్న ర్యాలీలో ఫిష్ ఆంధ్ర నినాదాలతో ఆయా పరిసరాలు మార్మోగాయి. చేపలు, రొయ్యలు వంటి సముద్ర ఉత్పత్తులు వల్ల ఆరోగ్యానికి మంచిదనే నినాదాలు చేసుకుంటూ ఉత్సాహంగా ర్యాలీ కొనసాగింది. ఎన్నో పోషక విలువలు, మాంసకతులు అత్యధికంగా లభించే చేపలు, రొయ్యలు తదితర సముద్ర ఉత్పత్తులను ఆహారంలో భాగం చేసుకోవాలన్నారు. ర్యాలీలో మత్స్య శాఖ జెడి నాగేశ్వరరావు, నాబార్డ్ డి జి ఎం రవి సింగ్, బి సి సంక్షేమ అధికారి వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాలిక విద్యను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి-నెల్లూరు: పేదరికం నుంచి బయటపడాలంటే చదువే బ్రహ్మాస్త్రమని భావించే గౌరవ ముఖ్య మంత్రి ఆశయాల మేరకు బాలికా విద్యను ప్రోత్సహిస్తూ, జిల్లాలో వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాది తోఫా పథకాలను అమలు చేస్తున్నట్లు కలెక్టర్ ఎం.హరినా రాయణన్ పేర్కొన్నారు.బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాది తోఫా పథకాలకు సంబంధించిన ఆర్థికసాయాన్ని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాల యం నుంచి సిఎం బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ు కలెక్టరే ట్లోని తిక్కన ప్రాంగణం నుండి శాసనమండలి సభ్యులు బల్లి కళ్యాణ చక్రవర్తి తో కలసి కలెక్టర్ ఎం హరినారాయణన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని 401 జంటలకు సంబం ధిం చిన 3 కోట్ల 36 లక్షల 50 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని వారి వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. కార్యక్రమంలో రమేష్, వెంకటయ్య పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-గుడ్లూరు: స్థానిక వైద్య ఆరోగ్య కేంద్రంలో 30 మంది గర్భిణులకు డాక్టర్ మారుతి రావు ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు బుధవారం నిర్వహించారు. వైద్య అధికారిని డాక్టరు ప్రియం వదా గర్భిణులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఐరన్ లోపం ఉన్నవారికి ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ప్రధానమంత్రి సురక్ష తా మాతత్వ అభియాన్ పథకం కింద గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టరు సబిహాసుల్తాన్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రంలోని కాన్పులు చేయించుకోవాలని తెలియజేశారు. ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-లింగసముద్రం : స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా బుధవారం 42మంది గర్భిణులకు రక్త పరీక్షలు, షుగర్ పరీక్షలు నిర్వహించడం జరిగిందని వైద్యాధికారి డాక్టర్ పి.రమేష్ చెప్పారు.పరీక్షలు నిర్వహించిన వారందరికి ఐరన్ ఫోలిక్, కాల్షియం టాబ్లెట్లు పంపిణీ చేశారు. గర్భిణులందరికీ వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలని,పౌష్టికాహారం గురించి, సురక్షిత ప్రసవం గురించి,కాన్పు అయిన తరువాత బిడ్డలకు ఇప్పించాల్సిన టీకాల గురించి అవగాహన కల్పించారు.అదే విధంగా పెదపవని గ్రామంలో గర్భిణులకు డాక్టర్ అనురాధ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ శ్రీనివాసులు, ఎఎన్ఎంలు. ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గిరిజనాభివృద్దే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-నెల్లూరు:గిరిజనుల అభివద్ధి, సంక్షేమమే ధ్యేయంతో రాష్ట్ర ప్రభుత్వం కషి చేస్తున్నదని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మాత్యులు కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కస్తూర్బా కళాక్షేత్రంలో గిరిజన సంక్షేమ శాఖ, సమీకత గిరిజనాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ ఆదివాసి దినోత్సవం కార్యక్రమ ంలో రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మాత్యులు కాకాణి గోవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిజనుల అభివద్ధి, సంక్షేమానికి కషి చేసిన డా. బి.ఆర్. అంబేడ్కర్ , శ్రీ వెన్నెలకంటి రాఘవయ్య గార్ల చిత్రపటాలకు మంత్రి శ్రీ గోవర్ధన్ రెడ్డి, పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందుగా ఆంధ్రప్రదేశ్ సమీకత గిరిజనాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఐటిడిఏ కార్యాలయం నుంచి కస్తూర్బా కళాక్షేత్రం వరకు జిల్లా అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. కూర్మనాథ్, ఐసీడీఎస్ పిడి హేన సుజన, డిడి సోషల్ వెల్ఫేర్ రమేష్, ఎస్.ఎస్ ఎపిసి ఉషారాణి, డిటిడబ్ల్యూఒ పరిమళ, వివిధ గిరిజన సంఘాల నాయకులు పెంచలయ్య, రామ చంద్రయ్య, చెంచయ్య, విద్యార్థులు, గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.

'నా భూమి..నాదేశం' మహోన్నత కార్యక్రమం

ప్రజాశక్తి-నెల్లూరు :జన్మనిచ్చిన నేలతల్లిని, స్వేచ్ఛగా జీవించేందుకు అవకాశం కల్పించిన దేశాన్ని గౌరవించుకునేలా చేపట్టిన నా భూమి- నా దేశం కార్యక్రమం ఎంతో మహోన్నతమైనదని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఉద్ఘాటించారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో నా భూమి...నా దేశం కార్యక్రమాన్ని కలెక్టర్ ఎం హరి నారాయణన్, జెడ్‌పి చైర్పర్సన్ ఆనం అరుణమ్మ తో కలిసి మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. తొలుత స్థానిక జాతిపిత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మంత్రి, ప్రజా ప్రతినిధులు, అధికారులు నా భూమి... నా దేశం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మొక్కలు నాటారు. విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పిలుపుమేరకు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నా భూమి... నా దేశం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ చిరంజీవి, జిల్లా అటవీ శాఖ అధికారి చంద్రశేఖర్, డిపిఒ సుస్మిత, డి ఎం హెచ్ఒ పెంచలయ్య, జిల్లా బిసి సంక్షేమ అధికారి వెంకటయ్య, పీడీ శ్రీనివాసులు, ఎస్ సి సి అధికారి నరేంద్రబాబు, విద్యార్థిని విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

త్వరలో వైసిపికి బుద్ధిచెబుతాం

మాట్లాడుతున్నబెజవాడ ప్రసాద్

ప్రజాశక్తి-కందుకూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి సొంత నియోజక వర్గం పులివెందులలో తెదేపా జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు బహిరంగ సభకు పెద్దఎతున వచ్చిన ప్రజలను చూసి ఓర్చు కొలేకే పుంగనూరు, అంగల్లు లో చంద్రబాబు పై దాడులు చేయించి, తిరిగి ఆయన పైన హత్యాయత్నం కేసులు పెట్టే స్థితికి జగన్ రెడ్డి దిగజారాడని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్ విమర్శించారు. రాష్ట్రం లో సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసం పై ప్రజలకు వివరిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్న విధానాన్ని ఎత్తి చూపుతూ చంద్రబాబు పర్యటన చేస్తుంటే దాని నుంచి దష్టి మరల్చదానికే కేసులు పెట్టాలని ప్రసాద్ విమర్శించారు. జగన్ రెడ్డి పాలనలో పౌర హక్కులు అనుభవించేందుకు ఏపీ ప్రజలు మరో స్వాతంత్ర్య పోరాటం చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలో సిఎం జగన్ రెడ్డి పాపాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, పుంగనూరు, అంగళ్లలో జరిగిన ఘటనలకు సంబంధించి చంద్రబాబు నాయుడిపై ఏ1, ఏ7గా కేసులు నమోదు చేయడం దుర్మార్గం అని, తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలోకి జెండా కర్రలతో వైసీపీ కార్యకర్తలు వచ్చి రౌడీయిజం చేయాల్సిన అవసరం ఏముందన్నారు. రానున్న ఎన్నికలలో తగురీతిలో బుద్ధి చెబుతారనిహెచ్చరించారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-కందుకూరు: ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉలవపాడులో ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఎంఇఒ ఎంవివి ప్రసాద్ రావు , ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ శివ నాగేశ్వరరావు అధ్యక్షతన బుధవారం జరిగింది. గత శిక్షణ కార్యక్రమాలలో ,ట్రాన్స్‌ఫర్ కారణాలవల్ల ,అటెండ్ కానీ వారికి శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈరోజు శిక్షణ పొందిన హైస్కూల్ ఉపాధ్యాయులు తప్పనిసరిగా రేపటి నుంచి వారి పాఠశాలల్లో టారి కార్యక్రమాన్ని అమలుపరచాలని ఉపాధ్యాయులను ఉద్దేశించి చెప్పారు. ఈరోజు జరిగిన శిక్షణ కార్యక్రమానికి ఆర్పీలుగా గట్టిబోయిన రమేష్, పివి రామకృష్ణ, సూరిలు కార్యక్రమాలను నిర్వహించారు. ఉపాధ్యాయులకు మెరుగైన శిక్షణను ఇచ్చారు.

బస్‌పాస్ ఛార్జీలు తగ్గించాలి

ప్రజాశక్తి-నెల్లూరు: ఎస్ఎఫ్ఐ నెల్లూరు నగర్ కమిటీ ఆధ్వర్యంలో పెరిగిన విద్యార్థి బస్సు పాస్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని, అదేవిధంగా ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న ప్రాంతాలకు బస్సులు ఏర్పాటు చేయాలని ఆత్మకూరు బస్టాండ్ వద్ద బస్టాండ్ మేనేజర్ కు వినతి పత్రం అందజేశారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి వి.నరేంద్ర మాట్లాడుతూ గతంలో కంటే బస్ పాస్ చార్జీ 100 రూపాయలకు పైగా పెంచడం జరిగిందన్నారు. ఇప్పటికైనా బస్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నెల్లూరు నగర్ కమిటీ సభ్యులు వంశీ దినేష్ తదితరులు పాల్గొన్నారు.

గోడౌన్లలో కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి-నెల్లూరు: ఈవిఎంల గోడౌన్ల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచాలని కలెక్టర్ ఎం హరి నారాయణన్ అధికారులను ఆదేశించారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా బుధవారం సాయంత్రం స్థానిక ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎంల గోడౌన్లను మున్సిపల్ కమిషనర్ శ్రీ వికాస్ మర్మత్ తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గోడౌన్ల లోని ఈవీఎంలు, వివి ప్యాట్లు, బ్యాటరీలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు.

కండువాలు కప్పుతున్న ఇంటూరి

టిడిపిలో 20కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-గుడ్లూరు: తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ ఇంటూరి నాగేశ్వర రావు సారథ్యంలో కందుకూరు నియోజకవ ర్గంలో తెలుగుదేశం పార్టీ బలం పుంజు కుంటుంది. నాగేశ్వరరావు కార్యకర్తలకు ఇస్తున్న ప్రోత్సాహం, మనోధైర్యం తోపాటు రాష్ట్రంలో నెలకొన్న దారుణ పరిస్థితులను గమనిస్తున్న అధికార పార్టీకి చెందిన అనేకమంది తెలుగుదేశం పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారు. తాజాగా గుడ్లూరు మండలం, చినలాటరిపి పంచాయతీలోని జానకంపేట గ్రామంలో వైసీపీకి చెందిన 20 కుటుంబాల వారు ఆ పార్టీకిగుడ్ బై చెప్పి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఇంటూరి నాగేశ్వరరావు వారందరికీ పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, చిట్యాల యానాదయ్య, తిరుపతి వెంకయ్య, కాపులూరి ప్రసాద్, చల్లా వీరరాఘవులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

టమోటాల కోసం జనం బారులు

ప్రజాశక్తి-కందుకూరు: రైతు బజార్లో సబ్సిడీ టమోటాల కోసం ప్రజలు బుధవారం బా రులు తీరారు. టమో టాల ధర ఆకాశాన్నం టుతుం డటంతో కందు కూరు వ్యవ సాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కేజీ 50 రూపాయలు వంతెన ప్రజలకు సరఫరా చేయడం ప్రారంభించారు. ఇప్పటికే అనేక దఫాలు సరఫరా చేశారు. బుధవారం రోజు పోలీసుల ఆధ్వర్యంలో ప్రజలదరిని క్యూ లైన్ లో నిలబెట్టి రెండు కౌంటర్లు ఏర్పాటు చేసి ఎలాంటి అసౌకర్యం లేకుండా తక్కువ సమయంలోనే టమోటాలు సరఫరా చేయడం జరిగింది. గతంలో టమో టాల కోసం క్యూ లైన్లో గంటల తరబడి నిల బడాల్సిన పరిస్థితి ఉండేది. ఈసారి మాత్రం ఆ పరిస్థితి లేకుండా పోలీసులు మార్కెట్ కమిటీ సిబ్బంది ఏర్పాట్లు చేయడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

మెడికవర్‌లో అధునాతన వైద్యం



మాట్లాడుతున్న డాక్టర్లు

ప్రజాశక్తి-నెల్లూరు

తీవ్ర ఒత్తిళ్లకు గురై , క్షణికమైన ఆవేశంకులోనై ఆత్మహత్య చేసుకోవాలన్న నిర్ణయంతో 'సూపర్ వాస్‌మోల్' (తెల్లని జుట్టును నల్లగా మార్చే ఒక ద్రావకం) సేవించి 25 సంవత్సరాల వయస్సు కలిగిన ఓ యువకుడు ప్రాణం మీదకు తెచ్చుకున్నాడు. సకాలంలో తల్లిదండ్రులు గుర్తించి వైద్యసేవల నిమిత్తం మెడికవర్ వైద్యశాలలోని అత్యవసర విభాగానికి తీసుకురాగా పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆ కేసును ఒక ఛాలెంజ్‌గా తీసుకొని చికిత్సలు నిర్వహించి యువకుడి ప్రాణాలను కాపాడారు. బుధవారం మెడికవర్ వైద్యశాలలో ఆ వైద్యశాల జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రవీంద్రరెడ్డి మీడియాతో మాట్లాడుతూ సూపర్ వాస్‌మాల్ సేవించిన యువకుడిని మెడికవర్ వైద్యశాలలోని అత్యవసర విభాగం వైద్య బృందం పరీక్షలు చేసి 250 మిల్లీ లీటర్ల ద్రావకం సేవించారని, ఎమర్జెన్సీ లో వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు అతని పరిస్థితిని జనరల్ ఫిజీషియన్ రవీందర్ రెడ్డి కి వివరించారు. వెంటనే రోగిని పరీక్షించిన ఆయన రోగి బంధువుల కు రోగి ఆరోగ్య పరిస్థితిని తెలియజేయగా వారి బంధువుల విజ్ఞప్తి మేరకు ఎంతో ఛాలెంజ్ తో కూడిన చికిత్స అయినప్పటికీ తనకున్న అనుభవంతో ఆ రోగి ప్రాణాలను కాపాడటం జరిగిందన్నారు. డాక్టర్ రవీంద్రారెడ్డి, జనరల్ ఫిజీషియన్. మాట్లాడుతూ' సూపర్ వాస్మాల్' తాగిన వారి విషయంలో ప్రమాదకర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను దీని వల్ల కలిగే ప్రమాదాన్ని వివరించారు.ఆత్మహత్య చేసుకోవడానికి సూపర్‌వాస్మోల్ (హెయిర్ డై) వినియోగం ఇటీవల అధిక మరణాలకు కారణమవుతున్నదన్నారు. సూపర్ వాస్మోల్ తాగడం వలన కలిగే అనారోగ్యం మరణాలను త్వరితంగా హాస్పిటల్ కి చేరుకొని సపోర్టివ్ సిమ్ప్టోమాటిక్ సహాయక చికిత్సతో నివారించవచ్చునని పేర్కొన్నారు. ఇది ముఖం ,గొంతు వాపు, శ్లేష్మ పొర దెబ్బతినడానికి కారణమవుతుంది. ఆకస్మిక మూత్రపిండ వైఫల్యం, మయోకార్డిటిస్ కార్డియాక్ ఇన్ఫార్క్షన్, లివర్ వైఫల్యం లకు కారణమౌతుందన్నారు. అన్ని విధాల సహకరిస్తున్న మెడి కవర్ ఆసుపత్రి యాజమాన్యానికి, నర్సింగ్ సిబ్బంది, ఆసుపత్రి సిబ్బందికి మా కతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు .

అంగన్‌వాడీలకు బిఎల్ఒ డ్యూటీలు రద్దు చేయాలి

వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి–పొదలకూరు

అంగన్వాడీలకు బిఎల్ఒ డ్యూటీలు రద్దు చేయాలని, ఉదయం 9 నుంచి నాలుగు గంటల, వరకు సెంటర్లో ఉండి విధులు నిర్వహించుకునే సందర్భంలో, బిఎల్ఒ డ్యూటీలకు సమయం ఉండదని, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ బుధవారం తహశీల్దార్‌కు అర్జీ సమర్పించారు. ఫోన్లలో రకరకాల యాప్‌ల ద్వారా గంట గంటకు ఆహార సేవలు ఆరోగ్య సేవలు ప్రీ స్కూలు జరుపుకుంటూ ఫొటోలు పెట్టుకోవాలని, ఫోనులు సక్రమంగా పనిచేయని కారణంగా అవి పని చేసేంతవరకు దానిపైనే దష్టి పెట్టాలన్నారు. సెంటర్ సమయంలో సచివాలయ ఎమ్మెస్కేలతోపాటు చాలా డిపార్ట్మెంట్ల వాళ్ల రోజూ విజిట్లు చేస్తున్నారన్నారు. సెంటర్ విధులు కాకుండా ఇతర ఏ పనులు చేయలేమని, అధికారికి తెలియజేశామన్నారు. రాజకీయ ఇబ్బందులు, భద్రత లేని ఉద్యోగాలు, కనీసం మెడికల్ లీవ్ సౌకర్యం కూడా లేనందున, ఈ డ్యూటీలు వేయవద్దని కోరారు. ఈ విషయంలో తహశీల్దార్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి రెహానా బేగం, సిఐటియు జిల్లా నాయకులు పెంచల నరసయ్య, అంగన్‌వాడీ మండల కార్యదర్శి స్వర్ణలతతో పాటు తొమ్మిది మంది అంగన్‌వాడీలు హాజరయ్యారు

ఘనంగా వీరులకు వందన కార్యక్రమం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :మండలంలోని సౌత్ ఆములూరులో బుధవారం ఆజాదీకా అమత మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నా మట్టి- నా దేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సౌత్ ఆములూరు పంచాయతీ సెక్రటరీ సి.హెచ్ విజయ దుర్గ హాజరయ్యారు. విద్యార్థులతో "పంచ ప్రాన్ ప్రతిజ్ఞ" చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ అహ్మద్ బాషా మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరులను గుర్తు చేసుకుంటూ చేసే ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులలో దేశభక్తి ,క్రమశిక్షణ పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది కె.సునీజ, మస్తాన్ బాషా, టి.మునెయ్య, పాఠశాల ఉపాధ్యాయులు కె.హిప్సి, విద్యులత, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-మర్రిపాడు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్యాధికారిణి డాక్టర్ కల్పన వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతినెలా 9న గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బుధవారం 25మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశామన్నారు. అనంతరం గర్భిణులు పాటించాల్సిన నియమాలు, ఆరోగ్య సూత్రాలు, ఆరోగ్య జాగ్రత్తలు, గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, ఆసుపత్రిలో ప్రసవాల ప్రాముఖ్యత, ప్రభుత్వం ద్వారా కలిగే ప్రయోజనాలను గూర్చి వివరించారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : మండలంలోని గర్భిణులు కాన్పు అయ్యేంతవరకు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని గండిపాలెం పిహెచ్సి వైద్యాధికారిణి శిరీషలత పేర్కొన్నారు. బుధవారం ఆమె గండిపాలెం పిహెచ్సిలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్షయోజన పథకంలో భాగంగా 17 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారన్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవసరమైనవారు స్కానింగ్లు తీయించుకోవద్దన్నారు. ప్రతినెలా వైద్యుల సహాలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు చేయించుకుని ప్రభుత్వ ప్రోత్సాహకాలు పొందాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య, అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి'పై వేమిరెడ్డి ప్రశ్న

ప్రజాశక్తి-నెల్లూరు : ఉపాధిహామీ పథకంలో ఆధార్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థ (ఎబిపిఎస్)పై బుధవారం పార్లమెంటులో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి కేంద్రానికి పలు ప్రశ్నలు వేశారు. ఆధార్ ఆధారిత చెల్లింపులతో ఉపాధి హామీ కూలీలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు.. అలా అయితే సమస్యల దృష్ట్యా ఎబిపిఎస్ను జూన్, 2023 తర్వాత పొడిగించబడిందా.. ఉపాధి హామీ కూలీ వ్యక్తిగత ఖాతాను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో అనుసంధానించడంలో ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత మంత్రిత్వ శాఖ ఎలా పరిష్కరిస్తుందో తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రశ్నలకు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి సమాధానమిచ్చారు.

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-సంగం : ఆత్మకూరు వైపు నుండి సంగంకు వస్తున్న ఆర్టిసి బస్సు, సంగం నుండి ఆత్మకూరు వైపు వెళ్తున్న ఆర్టిసి బస్సు ఎదురెదురుగా ప్రమాదవశాత్తు ఢీకొన్న సంఘటన బుధవారం సంగం సమీపంలో కొండ కూడలి వద్ద చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. రెండు ఆర్టిసి బస్సులలో సుమారు 70 మంది ప్రయాణీకులకు తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. ఆర్టిసి బస్సుల ముందు భాగాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. అనంతరం ఆర్టిసి సిబ్బంది ప్రయాణికులను సురక్షితంగా వేరే బస్సులో తరలించారు.

టిడిపి నాయకులపై అక్రమ కేసులు

ప్రజాశక్తి-కావలి : పాదయాత్ర, రోడ్ షో చేస్తున్న టిడిపి అగ్రనేత నారా చంద్రబాబు నాయుడు, తదితర నాయకులపై వైసిపి నేతలు అక్రమ కేసులు పెట్టడం వైసిపి నీచ సంస్కృతి కి నిదర్శనమని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు విమర్శించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో పత్రికా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సుబ్బా నాయుడు మాట్లాడుతూ 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసి నారా చంద్రబాబు నాయుడుపై, పార్టీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టించడం నీచ సంస్కృతికి నిదర్శనమన్నారు. విద్యుత్ ఉద్యోగులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ నెరవేర్చనందుకు నిరసనగా తమ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించకుండా ప్రజలకు విద్యుత్ కోతలను గురిచేస్తూ బాధపెట్టడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ప్రజాబలం కోల్పోయిన వై.సి.పి దొంగ ఓట్లతో గెలవాలని అనుకోవడం ఓటమిని ఒప్పుకోవడమేనని అన్నారు. సమావేశంలో జిల్లా తెలుగు రైతు ఉపాధ్యక్షులు బొట్లగుంట శ్రీహరి నాయుడు, మండల అధ్యక్షులు ఆవుల రామకృష్ణ, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్.మస్తాన్, రాష్ట్ర వికలాంగుల సంఘం ఉపాధ్యక్షులు మండవ వెంకట్రావు, మండల పార్టీ రైతు సంఘం అధ్యక్షులు పులి సుధాకర్, నియోజకవర్గ ఎస్సిసెల్ అధ్యక్షులు దావులూరి దేవకుమార్, 31వ వార్డు పార్టీ ఇన్‌ఛార్జి మంచాల ప్రసాద్, 39వ వార్డు పార్టీ ఇన్‌ఛార్జి ప్రళయకావేరి మల్లికార్జున, మహిళా నేతలు కొల్లూరు అశ్విని, అమర జ్యోతి, రాపూరి రాధమ్మ, ముఖ్య నాయకులు ఆత్మకూరు నాగరాజు, షేక్ రఫీ అహ్మద్, షరీఫ్, తోట కళ్యాణ్, బూసి రవి యాదవ్, అంబటి కిషోర్, నరసింహం పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : గత వారం రోజుల నుంచి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇరిగేషన్ ప్రాజెక్టులపై చేస్తున్న యుద్ధభేరి కార్యక్రమంలో భాగంగా చిత్తూరు జిల్లాలోని తంబళ్లపల్లి, పుంగనూరు నియోజకవర్గాలలో ఆయనపై దాడి చేయడమే కాకుండా తిరిగి ఆయనపైన, టిడిపి నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించినట్లు, అందుకు నిరసనగా ఆత్మకూరు నియోజకవర్గ కేంద్రమైన ఆత్మకూరులోని బస్టాండ్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహం వద్ద పలువురు నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, పట్టణ టిడిపి అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, 3వ వార్డు కౌన్సిలర్ షేక్.గౌస్ బాషా, తెలుగు యువత మాజీ జిల్లా ఉపాధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, 7వ వార్డు ఇన్‌ఛార్జి రబ్బాని, షేక్ మీరా మోదిన్, కాపా వెంకటసుబ్బయ్య, మాలేపాటి సురేష్, గోరి షబ్బీర్, బేకరీ మస్తాన్, వెంకటేశ్వర్లు, చెంచు నాయుడు, బండ్లపల్లి రమణయ్య, చిన్నబ్బయ్య, పొట్లూరి రమణయ్య, కొల్లా వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా చిత్రపటాల ప్రదర్శన

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లావ్యాప్తంగా స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాల ప్రదర్శన జరిపేందుకు కృషి చేస్తామని ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ తెలిపారు. డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో చిత్రపట ప్రదర్శన ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ఈ చిత్రపట ప్రదర్శనలు జరుపుతామన్నారు. 6, 7, 8 తేదిలలో 3వేల మంది విద్యార్థులు నెల్లూరు ప్రజలు పాల్గొన్నారు. ప్రముఖ చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహ్మద్ మాట్లాడారు. అనంతరం ప్రముఖ చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహ్మద్‌కు, ప్రముఖ చిత్రకారులు మహమ్మద్‌గౌస్‌లను సన్మానించారు. కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ రఫీ, జిల్లా కమిటీ సభ్యులు షేక్ రియాజ్, భాష, సయ్యద్ సర్దార్, షేక్ జాన్ బాషా, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు అజీజ్ కార్యదర్శి అహ్మద్, ట్రస్ట్ సభ్యులు జయరాం రెడ్డి, నరసింహారెడ్డి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలో రాయితీ ప్రయాణ సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి-నెల్లూరు

సీనియర్ సిటిజన్స్‌కు, పెన్షనర్లకు రైల్వేలో రాయితీతో కూడిన ప్రయాణ సౌకర్యం కల్పించాలంటూ ఎపిఆర్పిఎ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. బుధవారం ఆర్‌సిటి బస్టాండ్ వద్ద ఎపిఆర్పిఎ జిల్లా కమిటీ నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా గతంలో ఉన్న విధంగా రైల్వేలో ప్రయాణించే సమయంలో పెన్షనర్లకు, సీనియర్ సిటిజన్స్‌కు రాయితీ కల్పించాలన్నారు. కనీస పెన్షన్‌గా రూ.9 వేలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ఆర్టిసి రిటైర్డు ఎంప్లాయీస్, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎపిఆర్పిఎ జిల్లా కార్యదర్శి చంద్రమౌళి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉద్యోగ కార్మిక సంఘాలు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయని, ఈ కార్యక్రమాలకు తమ సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా డిఎ ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో ఎం.ఆర్.రెడ్డి, విపి నరసింహారెడ్డి, సుబ్రహ్మణ్యం, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమే బాధ్యత వహించాలి

మణిపూర్ ఘటనకు నిరసనగా భారీ స్థాయిలో శాంతిర్యాలీ

ప్రజాశక్తి-ఉదయగిరి

మణిపూర్‌లో జరిగే ఘటనలకు కేంద్రమే బాధ్యత వహించాలని జెఎసి యాక్షన్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం ఉదయగిరి పట్టణంలో మునుపు ఎన్నడూ చూడని విధంగా తరహా రీతిలో జెఎసి యాక్షన్ కమిటీ ఉగ్రరూపం దాల్చి కుల మతాలకు, పార్టీలకు అతీతంగా సుమారు వెయ్యి మంది కార్యకర్తలు ఈ శాంతి ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎబిఎం చర్చి నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ గవర్నమెంట్ హాస్పిటల్ మీదుగా ఉదయగిరి బస్టాండ్‌కు చేరుకొని మానవహారం ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులపై దాడి, ముజఫర్ నగర్‌లో ముస్లింస్‌పై దాడి, ఉత్తరప్రదేశ్‌లో ముస్లిం, క్రైస్తవులపై దాడి, మణిపూర్‌లో ఇటీవల

శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

క్రైస్తవులపై దాడి జరిగిన సంఘటన చూస్తుంటే కేంద్ర ప్రభుత్వమే కావాలని చేయిస్తున్నట్లు ఉందంటూ విమర్శించారు. ఇంత జరుగుతున్న మణిపూర్ సంఘటనపై పార్లమెంట్ సమావేశాలలో ఎందుకు ప్రశ్నించలేదన్నారు. ఈ పరిణామాన్ని ముక్త కంఠంతో ఖండిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా జెఎసి యాక్షన్ టీం సభ్యులు మాటాడుతూ మణిపూర్ బాధితులకు న్యాయం చేయాలని, సుప్రీంకోర్టు జడ్జీలతో విచారణ జరిపించాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని, మణిపూర్‌లో శాంతి నెలకొల్పి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలన్నారు. మణిపూర్ ప్రభుత్వంతోపాటు కేంద్రాన్ని కూడా డిమాండ్ చేస్తున్నట్లు జెఎసి కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో జెఎసి కమిటీ సభ్యులు దస్తగిరి అహ్మద్, రియాజ్, షంషేర్, గొల్లపల్లి తిరుపతయ్య, పాదర్ సుదర్శన్, పాదర్ సునీల్, పరిశుంబపాదు స్వామియేల్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ తాతిపూడి రాజశేఖర్, కలిసెల ఎలిషాకుమార్, జకీర్ జాషువా, సిపిఎం నాయకులు కాకు వెంకటయ్య, మహిళా నాయకురాలు కాకు విజయ, ఆవాజ్ మండల కమిటీ సభ్యులు నాయాబ్ నేల టూరి జాషువా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా సిఐ గిరిబాబు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

ఆరోగ్య కేంద్రంలో డిఎంహెచ్ఒ పరిశీలన

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం కోవూరుపల్లి గ్రామంలో ఉన్న ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో బుధవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం కేంద్రంలోని రికార్డులను పరిశీలించి, గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య అధికారి పెంచలయ్య మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య చికిత్సలపై ఆరా తీశామని, ఆరోగ్య కేంద్రంలోని సిబ్బందికి వైద్య సేవలపై తగు సూచనలు సలహాలు తెలియజేశామన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ. వైద్య అధికారి సీమాతబస్సుమ్, వైద్యసిబ్బంది, తదితరులున్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ పెంచలయ్య

ధ్రువీకరణ పత్రాలకే ఇబ్బందులు..

- మరమ్మతులకు గురైన ప్రింటర్

ప్రజాశక్తి-కొండాపురం

మండలంలోని విరువూరు గ్రామ సచివాలయంలో గత 15 రోజులుగా రోజులుగా ప్రింటర్ సౌలభ్యం లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఏదైనా ధృవీకరణ పత్రాలు కానీ, వన్‌బి, అడంగల్ కానీ తీసుకోవాలంటే వీలుపడని పరిస్థితి ఈ విషయమై ఉద్యోగులు ఉన్నతాధికారులకు తెలియజేసినా ఇప్పటికీ ఫలితం మాత్రం శూన్యంగా ఉంది. సంబంధింత అధికారులు ఈ ప్రింటర్ వ్యవహారం చక్కదిద్దితే ప్రజలకు ఎంతో మేలు చేసినట్లు అవుతుందని సచివాలయ పరిధిలోని ప్రజలు కోరుతున్నారు.

విరువూరు సచివాలయం

నిరసన వ్యక్తం చేస్తున్న రైతుసంఘాల నాయకులు

కునారిల్లుతున్న వ్యవసాయ రంగం

ప్రజాశక్తి-నెల్లూరు

దేశంలో వ్యవసాయ రంగం రోజురోజుకు కునారిల్లుతుందని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట రైతు సంఘాలు ఆందోళన చేపట్టాయి. ఈ సందర్భంగా రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి ప్రభుత్వం చేయూతనందించి ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వం ఆదాయ వనరులు కల్పిస్తుందన్నారు. సమస్యల సాధన కోసం రైతులు ఐక్య పోరాటానికి తిరిగి సిద్ధం అవుతున్నారని, అందులో భాగంగా దేశం మొత్తం మీదా క్విడ్ కార్పొరేట్ పేరుతో కార్మికులు, కర్షకులు ఆందోళనలకు పిలుపు నిచ్చారు. రైతు సంఘాల నాయకులు కోటిరెడ్డి, పి.శ్రీరాములు, షానవాజ్, గంగపట్నం రమణయ్య, పుల్లయ్య, వెంకమరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎను ఆహ్వానిస్తున్న ఎజిఒలు

ఎన్‌జిఒ మహాసభలకు మేకపాటికి ఆహ్వానం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

విజయవాడలో 21, 22 తేదీల్లో ఎపి ఎన్‌జిఒ మహాసభలు జరగుతున్నాయని, ఈ మహాసభ లకు హాజరుకావాలంటూ ఎన్‌జిఒ నాయకులు బుధవారం ఆత్మకూరు ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్న ఈ మహాసభలకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఎంఎల్ఎ మేకపాటి చేతుల మీదుగా ఆవిష్కరింపచేశారు. రెండురోజుల పాటు జరిగే మహాసభలకు హాజరుకావాలని కోరారు. స్పందించిన ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి ఎపి నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎపి ఎన్‌జిఒ మహాసభలకు తప్పక హాజరవుతానని తెలిపారు. ఈ సందర్భంగా ఎపి ఎన్‌జిఒ సంఘం నాయకులు ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డిని శాలువాలతో సత్కరించి పూలబొకేలను అందజేశారు. కార్యక్రమంలో ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ ఆత్మకూరు తాలూఖా అధ్యక్షులు బి.శైలజ, ప్రధాన కార్యదర్శి బి.చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.శ్రీధర్ రావు, ట్రెజరర్ బి.సుప్రియ, అసోసియేట్ ప్రెసిడెంట్ ఆర్.వి.సుబ్బయ్య, వైస్ ప్రెసిడెంట్ కె.ఉత్తయ్య, రామకృష్ణ, బషీరా, భాగ్యమ్మ, నరసింహులు, శ్రీనివాసులు, వైసిపి నాయకులు మహ్మద్ ముజిబుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య విగ్రహానికి నివాళులు

ప్రజాశక్తి-బిట్రగుంట : అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవం సందర్భంగా బోగోలు మండలం కప్పరాళ్ల తిప్ప వద్ద ఉన్న రామాపురం గ్రామంలో అంతర్జాతీయ ఆదివాసుల దినోత్సవం కార్యక్రమాన్ని ఎరుకుల వీరుడు ఏకలవ్య విగ్రహ వ్యవస్థాపక అధ్యక్షుడు బచ్చు చంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకలవ్య విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలను వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటీష్ రాచరిక పాలనలో గిరిజనుల కోసం ప్రాణాలు తెగించి పోరాడిన గిరిజన బిడ్డ అని కొనియాడారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ఎరుకుల హక్కుల పోరాట జిల్లా ప్రధాన కార్యదర్శి కా వాటి శ్రీనివాసులు, ఆమ్ ఆద్మీ జిల్లా కార్యదర్శి గణపతి, బిజెపి జిల్లా మోర్చా కార్యదర్శి ఆవుల అరుణ్ కుమార్, అల్లి మడుగు ఎంపిటిసి ఎం.మోహన్ రావు, బోగోలు సచివాలయ కన్వీనర్ దాసరి సురేష్, అభిలాష్, కిషోర్, మహిళా కార్యదర్శులు, ఎరుకుల సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచండి..

- జిల్లా విద్యాశాఖ అధికారి గంగాభవాని

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్

పాఠశాలలలో విద్యార్థుల హాజరుశాతం పెంచే విధంగా ఆ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బాధ్యతగా తీసుకొని విద్యార్థుల హాజరు పెంచే విధంగా పనిచేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి గంగాభవాని పేర్కొన్నారు. బుధవారం ఆత్మకూరు డివిజన్‌లోని మండలాలు అనంతసాగరం, అనుమసముద్రంపేట, ఆత్మకూరు, దుత్తలూరు, మర్రిపాడు, సంగం, సీతారామపురం, ఉదయగిరి, వింజమూరు మండలాల విద్యాశాఖ అధికారులు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఎంపిడిఒ కార్యాలయంలో 2023-24 విద్యా సంవత్సరంలో పాఠశాలలో చేపట్టాల్సిన విద్య విషయక కార్యక్రమాలపై రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ గంగా భవాని మాట్లాడుతూ విద్యార్థుల హాజరు శాతం పెంచే విధంగా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులకు ఇచ్చే విద్యా కానుక, షూ, బెల్ట్, యూనిఫారం, తప్పక పాఠశాలకు వేసుకుని వచ్చే విధంగా చూడాలన్నారు. అదేవిధంగా మధ్యాహ్నం భోజనం విషయంలో వంటగది శుభ్రత వంట చేసేవారు శుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని సూచించారు. పాఠశాలకు హాజరైన విద్యార్థులకు కోడిగుడ్లు, చిక్కీలు తప్పనిసరిగా అందజేయాలని సూచించారు. నాడు - నేడు పనులు జరిగే క్రమంలో విద్యార్థులను బిల్డింగ్‌ల వద్దకు పోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధానోపాధ్యా యులు సబ్జెక్టులను బోధించాలని తెలిపారు. ఇవన్నీ కూడా ప్రధానోపాధ్యాయులు బాధ్యతగా వహించాలని లేనిపక్షంలో వారిపై కఠిన నిర్ణ యాలు ఉంటాయని తెలిపారు. ఎంఇఒలు నిర్వ హించే సమావేశానికి ప్రధానోపాధ్యాయులు తప్పని సరిగా హాజరు కావాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపవిద్యాశాఖ అధికారి రఘురామయ్య, ఎంఇఒలు నజీర్‌బాషా, చలపతిరావు, ఇతర మండలాల ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఇఒ గంగాభవాని

సమగ్ర ఓటరు జాబితాకు సహకరించండి

మాట్లాడుతున్న జి.సువర్ణమ్మ

ప్రజాశక్తి-ఉదయగిరి

సమగ్ర ఓటర్ల జాబితా తయారీకి అన్నీ రాజకీయ పార్టీలు బిఎల్ఒలకు సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి జి.సువర్ణమ్మ పేర్కొన్నారు. బుధవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో 8 మండలాల తహశీల్దార్లు, అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. బూత్‌స్థాయి అధికారులు ఇంటింటికి తిరిగి ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన విషయాలను సేకరించాలన్నారు. రాజకీయ పార్టీలు నియమించుకున్న బిఎల్ఒలు వారికి సహకరించాలన్నారు. తహశీల్దార్లు సర్వేను పరిశీలిస్తుండాలన్నారు. సర్వే పారదర్శకంగా జరిగేలా చూడాలన్నారు. ప్రతి బిఎల్ఒలు ఇంటింటికి తిరిగి సర్వే చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జగదీష్ బాబు, అన్ని మండలాల తహశీల్దార్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : బిఎల్ఒలు ఓటర్ల జాబితాలో నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా ఉండాలని ఆర్‌డిఒ కరుణకుమారి తెలిపారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో బిఎల్ఒలు, బిఎల్ఎలు, సూపర్‌వైజర్లు, రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వలంటీర్ల ప్రమేయం లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎఒ సుభద్ర, వైసిపి నాయకులు అల్లారెడ్డి ఆనందరెడ్డి, నోటి వినయ్ కుమార్ రెడ్డి, సయ్యద్ జమీర్, కొప్పోలు చిన్నపరెడ్డి, టిడిపి నాయకులు తుమ్మల చంద్రారెడ్డి, కౌన్సిలర్ గౌస్ బాషా, బిఎస్‌పి నాయకులు నంద ఓబులేసు, జనసేన నాయకులు నలిశెట్టి శెట్టి శ్రీధర్, డిటి రాజేష్, విఆర్‌ఒలు, తదితరులు పాల్గొన్నారు.

11న సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-వరికుంటపాడు : వరికుంటపాడు మండల సర్వసభ్య సమావేశం మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు గవద కట్ల వెంకటలక్ష్మమ్మ అధ్యక్షతన 11వ తేదీన జరుగుతున్నట్లు ఎంపిడిఒ విజయ భాస్కరరావు తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలన్నారు.

తుపాన్ కేంద్రాలను ఆధునికీకరించాలి

ప్రజాశక్తి-కావలి

అకస్మాత్తుగా వచ్చే భీకర తుఫాన్ ప్రళయాలకు, పెద్దపెద్ద గాలి వానలకు ప్రభుత్వం నిర్మించిన పునరావాస కేంద్రాలు శిథిలావస్థలో ఉన్నాయని, వాటిని వెంటనే ఆధునికీకరణ చేసి మత్స్యకారులకు, తీరప్రాంత ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వచ్చి వారికి రక్షణ ఏర్పాట్లు చేయాలని సామాజిక కార్యకర్త ఐ.సాయిప్రసాద్ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సముద్రంలో మురుగు నీరు, వ్యర్థ పదార్థాలు రాకుండా జాగ్రత్తలు తీసుకొని మత్స్య సంపదను పెంచుకొంటే ఆర్థిక వ్యవస్థ మెరుగు పడుతుందన్నారు. ఈ కాలుష్యం వల్ల సముద్ర దగ్గరలో ఉన్న చేపలు చనిపోయి మత్స్య సంపద కరవవుతుందని తెలిపారు. దీనివల్ల మత్స్యకారులకు చేపలు దొరకక వేటకోసమని ఎన్నోవేల కిలో మీటర్లు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా అటు మంగుళూరు, ఒరిస్సా, తమిళనాడు వెళుతున్నారని తెలిపారు. అలాంటి దూర ప్రాంతాలకు వెళ్లి సముద్రంలో వేట కొనసాగిస్తున్న మత్యకారులు ఒక్కోసారి కడలిగాండ్రింపులకు బలైపోతున్నారన్నారు. అలా దూర ప్రాంతాలకు వెళ్లి సముద్రంలో వేట కొనసాగిస్తున్న మత్యకారులను గుర్తించి ప్రభుత్వం వారు ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తే తద్వారా ఆయా కుటుంబాలకు ఆర్థిక భరోసా ఉంటుందని తెలిపారు. కావున దగ్గరలో ఉన్న సముద్ర జలాలను కలుషితం కాకుండా చూసుకొని మత్స్య సంపదను కాపాడుకుందాం -ఆర్థిక మాంద్యం పెంచుకొందాం.. అనే దృక్పథంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మత్యకారులకు రాయితీ ద్వారా డీజిల్, మర పడవలు, ఇంజన్ బోట్లు, మౌలిక సదుపాయాలు కల్పించి మత్స్యసంపదను పెంచుకొని ఆర్థిక వ్యవస్థను మెరుగు పరచుకోవాలని తెలిపారు.

12నుంచి ప్రజాపోరు యాత్ర

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో 12వ తేదీ నుంచి 15వతేదీ వరకూప్రజాపోరు యాత్ర జరుగుతుందని మండల కార్యదర్శి ఆలూరు తిరుపాలు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ప్రజలు ప్రజాపోరు యాత్రను జయప్రదం చేయాలని కోరారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్

మండలంలోని కరటంపాడు గ్రామానికి చెందిన పఠాన్ జిలానీ బేగంకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.55వేల చెక్కును బుధవారం నెల్లూరులోని మేకపాటి క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి అందజేశారు. కరటంపాడు గ్రామానికి చెందిన పఠాన్ మహబూబ్ ఖాన్ భార్య జిలానీ బేగం మోకాళ్ల శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆర్థిక పరిస్థితి బాగాలేని కారణంగా ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు చేయించాలని మండల నాయకుల ద్వారా ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డికి విన్నవించడంతో ఆయన ముఖ్యమంత్రి సహాయనిధిని మంజూరు చేయించి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జెసిఎస్ కోఆర్డినేటర్ వల్లభనేని రాజేంద్రనాయుడు ఉన్నారు.

కాంగ్రెస్ నేతల సంబరాలు

ప్రజాశక్తి-అనంతసాగరం

అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టు లోకసభ సభ్యత్వాన్ని తిరిగి పునరుద్ధరించడంతో రాష్ట్ర అఖిల భారత కాంగ్రెస్ పార్టీ కోఆప్షన్ సభ్యులు నియోజకవర్గ యువజన అధ్యక్షుడు వేము ప్రవీణ్ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ యువజన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల నడుమ కేక్ కట్ వేడుకలు చేసుకున్నారు. మండల ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు, రైతు సంఘం అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, ఆటో మెకానిక్ సంఘం అధ్యక్షుడు షేక్ మస్తాన్, కర్షిక సంఘం అధ్యక్షుడు దుద్దు వెంకటేష్, మండల కార్యవర్గం సభ్యులున్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కావలి

ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ పథకం కింద వెంగళరావు నగర్ పి.హెచ్.సి. డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పి.హెచ్.సి వైద్యులు డాక్టర్ రమ్య మాట్లాడుతూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా మాతా, శిశు మరణాలు నివారించవచ్చని, రక్తహీనతను అధిగమించాలంటే పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. గర్భిణులు డాక్టర్ల సలహాలు పాటిస్తూ ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వాలన్నారు. తదుపరి డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ వారు ఐరన్ పోలిక్, కాల్షియం, విటమిన్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహరరెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్ ప్రసాద్, ఎఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో డిఇఒ సమీక్ష

ప్రజాశక్తి-కావలిరూరల్

మండల పరిధిలోని ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయుల సమీక్ష సమావేశం బుధవారం ఎంఇఒ కార్యాలయం ఆవరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారిణి గంగాభవాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు అందించాల్సిన పాఠ్యపుస్తకాలు, జగనన్న విద్యా కానుక, మిడ్ డే మిల్స్, స్కూల్స్ కి డ్రాప్ అవుట్ అయిన విద్యార్థులు, ఐఎఫ్ఎ ప్యానల్, పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనుల గురించి వివరించారు. మండల పరిధిలోని పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని సకాలంలో పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ రఘురామయ్య, మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ గోవిందయ్య (2), మండల పరిధిలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలుచోట్ల 'అమృత్' మహోత్సవాలు

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం పరిధిలో మంగమూరు గ్రామ పంచాయతీలో జరిగిన మా భూమి - నా దేశం నేల తల్లికి నమస్కారం కార్యక్రమం సర్పంచ్ వినోద్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిడిఒ సుబ్బారావు పాల్గొని మాట్లాడుతూ ఆజాదీ కా అమృత మహోత్సవంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించి అక్కడ ఉన్న విద్యార్థులకు భారతదేశ గొప్పతనం గురించి వివరించారు. ఆజాదీ కా అమృత మహోత్సవ భాగంగా ప్రతిరోజుకు ఒక కార్యక్రమం జరుగుతుందని ఆ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొనాల్సిందిగా కోరుతున్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శి కొండయ్య, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు ఇన్‌ఛార్జి, విస్తరణ అధికారి జహీర్ భాషా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి వరికుంటపాడు : దేశం కోసం పలు త్యాగాలు చేసిన త్యాగధనులను ప్రార్థిస్తూ వారి చిత్రపటాలకు నమస్కరించి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ఆజాదీకా అమృత మహోత్సవం బుధవారం మండలంలోని తూర్పు బోయమడుగులో నిర్వహించారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణంలో దేశ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి చెట్లను నాటి విద్యార్థులతో ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ విజయభాస్కర రావు, సర్పంచ్ నాగరాజు, వైసిపి నేత సిద్ధయ్య, ప్రధానోపాధ్యాయుడు రమేష్, పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : స్థానిక మేకపాటి రాజమోహన్ రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆజాదీకా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మేరీ మాటి మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పి సుబ్బ లక్ష్మమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు అధ్యాపకులు ప్రతిజ్ఞ చేశారు. అధ్యాపకులు నరసింహులు, వెంకటసుబ్బయ్య, విక్రం తదితరులున్నారు.

ప్రజాశక్తి-జలదంకి : మండలంలోని అన్నవరంలో బుధవారం ఎంపిడిఒ శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో పంచ ప్రాణ ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఆజాదీకా అమృత మహోత్సవం వేడుకలలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. నూతన సచివాలయం సమీపంలో శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి అక్కడ వీరులకు వందనం చేశారు. అనంతరం సచివాలయం ప్రాంగణంలో ఎన్ఆర్ఇజిఎస్ ఎపిఒ శ్యామల ఆధ్వర్యంలో మొక్కలను నాటించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గుమ్మడి మార్తమ్మ తో పాటు పంచాయతీ కార్యదర్శి జె రేవతి, సచివాలయం సిబ్బంది, వైసిపి నాయకులు గుమ్మడి రమేష్, వాలంటీర్లు, ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ కే మనోహర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యవసాయశాఖ అధికారులకు శిక్షణ

ప్రజాశక్తి-కావలిరూరల్ : డాక్టర్ వైఎస్ ఆర్ ఇంటిగ్రేటెడ్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లో విత్తనాలు ఎరువులు, మట్టి పరీక్షలపై జిల్లాలోని కావలి, కోవూరు, కందుకూరు, ఆత్మకూరు, పొదలకూరు, ఉదయగిరి, నియోజక వర్గాల వ్యవసాయ శాఖ అధికారులకు శిక్షణ తరగతులు రెండో రోజు కావలి ఎడి సిహెచ్ నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నెల్లూరు డిఆర్‌సి డిడిఎ శివం నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7 రోజులపాటు వ్యవసాయ విస్తరణ అధికారులకు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో విత్తనాలు, ఎరువులు, మట్టి, పరీక్షలు చేయించుకొని తక్కువ ఖర్చుతో నాణ్యమైన పంటలు పండించుకోవచ్చని సూచించారు. ఉదయగిరి ఎఒ జయరాజు, కందుకూరు ఎఒ గీత, ప్రకాష్, కోవూరు ఎఒ మేరీ, కమల, ఆత్మకూరు ఎఒ శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.